24062024-DIS-04_Layout 1 6/24/2024 2:23 AM Page 1



తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, నూతనంగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com



## కానుక

వాటి మానాన అవి
మేస్తున్నవి
మేత కోసం వాడు
వాటిని కోస్తున్నడు

నిరపేక్షంగా కొమ్మ
పూసింది కాసింది
ఆపేక్షగా వాడు
వాటిని అందుకొన్నడు

ఆకులు ఊసులాడాయి
గాలి శబ్దించింది
మనిషి, స్వార్థం, హింస
మాటలు వినిపించాయి

మనలో ఒకడే
మాటతో వేరయ్యాడు
మన నెత్తికెక్కాడు
ప్రకృతి ప్రకోపించింది



డాక్టర్ బీవీఎన్ స్వామి
9247817732

# బంజారా జీవన రేఖలు



'మీరు చెప్తే నమ్మరు గానీ
ఆ జొన్నరొట్టెలు
తండాకు రానన్న ప్రతి వాడి
గల్లా పట్టి లాక్కొస్తాయి.
మా రొట్టె దేహం నిండా
కనబడని పచ్చిదనం
జీబ్లోని తడిని పీల్చుకుని
నాలుకను నమిలి మింగేస్తుంది..'

అంటూ అచ్చంగా, స్వచ్ఛంగా ఉన్న తన తండా గురించి గుండె మీద అక్షరాల పచ్చబొట్టు పొడుచుకొని ఎలుగెత్తి చెప్తాడు కవి రమేశ్ కార్తీక్ నాయక్, ఊరఫ్ నునావత్ కార్తీక్, మొకాం జక్రాన్‌పల్లి, వల్ద్ మోజీరాం, సేవంత. ఇప్పుడిప్పుడే అక్షరాల ఒడిలో ఓనమాలు దిద్ది, అంబాడుతున్న ఈ లంబాడీ పిల్లగాని 'జారెర్ బాటి' కవిత ఖమ్మం డిగ్రీ కళాశాల విద్యార్థులకు పాఠ్యాంశం. అంతేకాదు, ఈ తెలంగాణ పిల్లగాని కవితల 'బల్దేర్ బండి'ని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎం.ఏ. పాఠాల్లో చేర్చింది.

తెలుగు సాహిత్యంలో అస్తిత్వవాద చైతన్యం ఇవ్వాల్టిది కాదు, అట్లని ఇంతకుముందు గిరిజన జీవితాలు, తండాలు మన సాహిత్యంలో లేవనీ కాదు. అందులోనూ గిరిజన, ఆదివాసుల జీవితాలను అనేక మంది గతంలో చిత్రించారు కూడా. పద్దం అనసూయ, మల్లీపురం జగదీశ్, కుంజ కళ్యాణి, ఆత్రం మోతీరాం, హాతీరాం, బట్టు విజయ్ వంటి ఆదివాసీ, సంచారజాతుల రచయితలు మొదలు, వి.ఎన్.వి.కె.శాస్త్రి, ఎ.విద్యాసాగర్, వాడ్రేవు చిన వీరభద్రుడు, సమ్మెట ఉమాదేవి వంటివారిని నేను చదివాను. వీరితో పాటు ఇంకొందరు ఉన్నప్పటికీ ఇక్కడ పేర్కొనడం లేదు. తండాలో పుట్టి, ఎదిగి... ఇవ్వాళ అక్కడి జీవితాలను, ఎతలను, బాధలను, గెలుచుకున్న జీవితాలను అక్షర చిత్రాలుగా మలుస్తున్న వారిలో నాకు ఆత్మీయులైన ఇద్దరున్నారు. ఒకరు బంజారాల బతుకమ్మ సూర్యాధనంజయ్, కాగా మరొకరు నేను పైన జెప్పిన రమేశ్ కార్తీక్ నాయక్.

రమేశ్ కార్తీక్ సర్కారు హాస్టల్‌లో ఉండి చదువుకొని బతుకు వేట కోసం పట్నం వచ్చినవాడు. ఆశ్చర్యంగా ఇరవై ఆరేండ్ల వయసులో ప్రతిష్ఠాత్మక కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం గెలుచుకొని ఇవ్వాళ వార్తల్లో నిలిచాడు. ఈ పురస్కార గ్రహీతల వరుసలో రమేశ్ 14వ వాడు. తన మాతృభాష గోర్ బంజారా భాషతో పాటు విద్యార్థిగా తాను చదువుకున్న తెలుగులో, ఆంగ్లంలో రచనలు చేస్తున్న రమేశ్ కవి, కథకుడు, అనువాదకుడు, టీవీ యాంకర్, వృత్తిరీత్యా ప్రైవేటు కళాశాలలో ఆంగ్లోపన్యాసకుడు. రచయితగా రమేశ్ తన నేపథ్యాన్ని, జీవితాన్ని, తన ఇరుగు పొరుగుల ఇంట్లో చూసిన జీవితాలను రచనలుగా అచ్చు వేశాడు. నిఖార్సయిన బంజారా జీవితాలను ప్రధాన స్రవంతిలో చేర్చి కావ్యగౌరవాన్నిచ్చాడు. 'బల్దేర్ బండి' రమేశ్ కవితా సంపుటి, ఆచార్య సూర్యాధనంజయ్‌తో కలిసి 'కేసులా' గోర్ బంజారా కథల సంకలనం తెచ్చాడు. 'చక్‌మక్' పేరుతో ఇంగ్లీషులో కవితా సంపుటి ప్రచురించాడు.

సాహిత్య అకాడమీ యువ పురస్కారం గెలుచుకున్న రమేశ్ పుస్తకం 'ఢావ్లో' గోర్ బంజారా కథలు. ఢావ్లో పదానికి అర్థం విషాద గీతం. ఇందులోని ఢావ్లో కథకు పుట్టింటిని విడిచిపోవడంలోని పెండ్లి కూతురు ఆవేదనతో తనవాళ్లందరిని తలుచుకుంటూ పాడే పాట ఇతివృత్తం. తన కథల్లో కేవలం తనవారి వెతలను, పండుగలు పబ్బాలను చెప్పి ఊరుకోలేదు రమేశ్. ప్రభుత్వ కార్యక్రమాలు, నాయకుల ఊరేగింపులు, జులూస్‌ల వంటి సమయాల్లో లంబాడాలను, వారి నృత్యాలను వాడుకోవడం పట్ల ఆవేదనతో కొంత ధర్మాగ్రహాన్ని కూడా తన కథల్లో ప్రదర్శిస్తాడు. ఇందులోని కథలన్నీ బంజారాల వ్యవసాయక జీవనం, విధానంతో పాటు అనేక అంశాలకు అద్దంగా నిలుస్తాయి. అటువంటి కథల్లో బర్రె నేపథ్యంగా వచ్చిన కథ 'పాడ్గి'. సేవు, సంగ్యాల సంసారంలో ఈతకొచ్చిన బర్రె చుట్టూ సాగే ఈ కథ జంతువులతో బంజారాల అనుబంధాన్ని చిత్రించిన రచన.

ఈ కథల్లోని జీవితాలే కాదు పాత్రలు, సంభాషణలు బంజారా స్త్రీలు ధరించే చమ్కీల అద్దాల్లాగే మెరుస్తాయి. 'లతకడా' దర్యా అనే బాలుని కథ. పందుల నుంచి జొన్న చేన్లను ఎట్లా కాపాడుకుంటారో చెప్తాడిందులో. వలలతో తండాకు దూరమైన బంజారాలు అనేక మందిని రోజూ పట్నాల్లో చూస్తూనే ఉంటాం... అటువంటి 'మనిషి' కథ రమేశ్ రాసిన 'ధర్మిబాయి' పనిమనిషి కథ. తాను సృష్టించిన ప్రతి పాత్ర ఎక్కడో తారసపడ్డట్టు అనిపించడం రమేశ్ రచనలోని ప్రత్యేకత.

కవిగా, రచయితగా దాదాపు దేశంలో జరిగిన అన్ని ప్రతిష్ఠాత్మక లిటరరీ ఫెస్టివల్‌లలో పాల్గొన్న రమేశ్, మన తెలుగు రాష్ట్రాల ఆదివాసి, గిరిజన, సంచార సమూహాల నుంచి సాహిత్య అకాడమీ యువ పురస్కారం అందుకున్న తొలి యువ రచయిత. అంతేకాదు బంజారా సమూహం నుంచి వచ్చిన తొలి కథా సంపుటి 'ఢావ్లో' కావడం విశేషం. తెలంగాణకు మరో యువ సాహిత్య పురస్కారాన్ని అందించిన రమేశ్‌కు అలాయి బలాయి.. దిల్‌సే ముబారక్ బాద్!



డాక్టర్ పత్తిపాక మోహన్
99662 29548

**(రమేశ్ కార్తీక్ నాయక్‌కు కేంద్రసాహిత్య అకాడమీ యువ పురస్కారం వచ్చిన సందర్భంగా...)**

కథ, నవలా రచయిత, కవి, కాలమిస్ట్, మాటల రచయిత, స్క్రీన్‌ప్లే రైటర్, నటుడు, పిల్లల ప్రేమికుడు, బాలల నవలా కారుడు, సాహిత్యాన్ని కళంకితం చేయని విశిష్ట మానవతావాది పమిడిముక్కల చంద్రశేఖర్ ఆజాద్. గుంటూరు జిల్లా, భట్టిప్రోలు మండలం, వెల్లటూరు గ్రామంలోని పమిడిముక్కల విజయలక్ష్మి, లక్ష్మణ్‌రావు దంపతులకు 1995, మే 24న చంద్రశేఖర్ ఆజాద్ జన్మించారు.

# అక్షర బాలానందం

చిన్ననాటి నుంచే సాహిత్యంపై ఆజాద్ మక్కువ పెంచుకున్నారు. 1971లో ఇంటర్మీడియట్ చదువుతున్నప్పుడు కాలేజీ సావనీరుకు 'నిరుద్యోగి (ఆత్మహత్య)' అనే కథను రాశారు. 1972లో ఇంటర్ పాసైనా పై చదువులకు వెళ్లలేకపోయారు. ఆరుగురు సభ్యుల కుటుంబ భారం ఆజాద్ మీద పడింది. అందుకే తెనాలి చేరుకొని, తన బావ హోటల్‌లో పనికి కుదిరారు.



**నాడే ఆజాద్ పేదల సంక్షేమం గురించి, సమాజం బాగోగుల గురించి రాజకీయ నాయకులకు ఉత్తరా లు రాసేవారు. ఆజాద్ భావాల తీవ్రతను కనిపెట్టి, అడవుల్లోకి వెళ్లే ప్రమాదం ఉన్నదని గ్రహించిన తల్లిదండ్రులు 1974లో 18 ఏండ్ల వయస్సులోనే పెండ్లి చేశారు. తర్వాత రొయ్యలు కొట్టడం, పాన్‌షాప్ నడపడం వంటి పనులను కుటుంబ జీవిక కోసం చేశారు.**

1975లో హైదరాబాద్ చేరుకొని, నవభారత్ టొబాకో కంపెనీలో చేరారు. చిన్ననాటి నుంచి సినిమాల్లోకి వెళ్లాలనే కోరికతో మద్రాస్ పంపిస్తాననగానే చేస్తున్న పని వదిలేసి, ఓ వ్యక్తి వెంట బయలుదేరారు. ఆయన రాజమండ్రిలో దింపి, ఇక్కడే చేపల పని చేయాలని చెప్పారు. అది నచ్చక మళ్లీ భాగ్యనగరం చేరుకొని, నాన్నగారి స్నేహితుడి ద్వారా ఏపీఎస్ఆర్టీసీలో రోజుకు పది రూపాయల కూలీకి కుదిరారు. అందులో పనిచేస్తూనే, జీవితం కొట్టిన దెబ్బలకు రచయితగా మారి, గాయాలకు లేపనం పూసుకుంటూ సాహిత్య ప్రస్థానం సాగిస్తున్నారు.

అపరాధక పరిశోధన నవలతో మొదలుపెట్టి, బాలల కథలు, నవలలు, పెద్దల కథలు, టీవీ సీరియళ్లు, మాటలు, స్క్రీన్‌ప్లేలు, ఇలా ఒకటి కాదు, తన నలభై ఏండ్ల సాహిత్య ప్రస్థానంలో స్పృశించని వచన ప్రక్రియ లేదు. ఆజాద్ రచనలు ముద్రితం కాని పత్రిక లేదు. రోజుకు 18 గంటలు రచనలు చేసేవారు. 900 కథలు, 80 నవలలు, 500 ఎపిసోడ్స్‌కు మాటలు రాయడమే కాకుండా అనేక టీవీ సీరియల్స్‌లోనూ నటించారు. 30 నవలలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో బహుమతులు వచ్చాయి. రెండు నంది అవార్డులు వరించాయి. కొన్ని పత్రికల్లో 'పిల్లల ప్రపంచం', 'చుక్ చుక్ రైలు', 'వాయిస్ ఆఫ్ చిన్ని', మొదలగు శీర్షికలతో బాలల శీర్షికలను నిర్వహించారు. ఆజాద్ సినిమా రచయితల సంఘానికి ప్రధాన కార్యదర్శిగా కూడా పనిచేశారు.

జమీందారు కోట, మా హృదయం, అందమైన పూలతోట, దారితప్పిన పిల్లవాడు, దేవతా ఓ దేవతా, ఆట, పిల్లల ప్రపంచం, బిట్టు దేవత మొదలైన నవలలు రాశారు. 2021లో తానా పోటీలో బహుమతి పొందిన పిల్లల నవల 'మాయా లోకం'. ఇదే నవలకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వరించడం ముదావహం. నలుగురు పిల్లల చుట్టూ తిరిగే, ఆసక్తి కలిగించే అంశంతో నడిచే నవల అశేష పాఠకులను ఆకట్టుకుంది. తాను రాసిన నవలల్లో పిల్ల పాత్రలే ఎక్కువ ఉంటాయి. ఆజాద్ తన డెబ్బై ఏండ్ల వయసులోనూ కలం వదలకుండా సాహితీ సేద్యం చేస్తూనే ఉన్నారు.

'మన బాల రచయితలు పంచతంత్ర కథల పరిధిని దాటి రాయలేకపోతున్నారు. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న సాహిత్యాన్ని అధ్యయనం చేయాలి. పాఠకులను పెంచుకోవాలి. బాల సాహిత్యంలో ఆధునికత రావాలి. ఆధునిక పిల్లల అంతరంగాలకు అనుగుణంగా రచనలు చేయాలి. మనం రాసే రచనలు జాతీయంగా, అంతర్జాతీయంగా పేరు తెచ్చుకునేలా కృషి చేయాలి' అని సూచించారు.



పుప్పాల కృష్ణమూర్తి
99123 59345

**(పి.చంద్రశేఖర్ ఆజాద్‌కు కేంద్రసాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కారం వచ్చిన సందర్భంగా...)**



## ఊరుది.. పేగు బంధం

మా ఊరుకు నాకు మధ్య
విడదీయలేని సంబంధం ఉంది
ఎంత దూరంలో ఉన్నా
ఎన్ని ప్రయాసలైనా
ఏడాదికి ఒకసారి అయినా
వెళ్లి చూడాలనిపిస్తది
తనివి తీర తిరగాలనిపిస్తది
చిన్ననాటి జ్ఞాపకాలను
నెమరు వేసుకోనిదే
ఆత్మ తృప్తి ఉండదు

ఊరును చూస్తున్నంత సేపు
ఎద లోపల ఏదో
దేవులాడుకున్నట్టు ఉంటది
లేగ దూడ లెక్క
అమ్మ కోసం వెతుకుతున్నట్టు ఉంటది
గంటల తరబడి కలియదిరిగి
సోపతిగాళ్లతో ముచ్చటలాడనిదే
మనసు కుదటనే పడదు

కోట బురుజు కాడ
బొడ్రాయి బజార్ దగ్గర
దోస్తుగాళ్లతో ఆటలాడిన
గుర్తులు ఎన్నెన్నో
గుండెల గుచ్చుతూనే ఉన్నవి

నాలుగు దిక్కులు
కండ్లారా చూసినంక
పల్లె తల్లి అమ్మ లెక్క
పలకరించినట్టు ఉంటది
ఎంతైనా ఊరుది
పేగు బంధం కదా!
ఎప్పుడు పోయినా
అక్కున చేర్చుకుంటూనే ఉంటది



కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి,
9441561655

**ఆధునిక తెలుగు కవిత్వంలో విలక్షణమైన, విశిష్టమైన కవి డాక్టర్ ఎన్.గోపి. మానవ సంబంధాలను ఉత్తమోత్తమ కవితలుగా మలచటంలో ఆయన కవిత్వం ఎప్పుడూ ముందుంటుంది. జీవిత చిత్రాలను సజీవంగా ప్రతిఫలింపజేసే సహజ కవి, నిరంతర చలనశీల కవి డాక్టర్ గోపి. వృద్ధుల్ని పక్వమైన జీవితానుభవం గలవారుగా చెప్తూ ఆయన ప్రకటించిన కవితా సంపుటి 'వృద్ధోపనిషత్'.**

# వృద్ధోపనిషత్-వస్తు భావనలు



కవిత్వంలో వ్యక్తమయ్యే ప్రధాన అంశాన్ని వస్తువు అంటాం. ఈ సంపుటి మొత్తం వృద్ధాప్యం గురించే మాట్లాడుతుంది. ఆ రకంగా ఇందులోని వస్తువు వృద్ధాప్యం. కవి తన కవిత్వం ద్వారా సాధించాలనుకున్న ఆశయాన్ని వస్తువు అని అనుకుంటే, ఈ సంపుటిలోని వస్తువును 'వృద్ధాప్యం' అనే చెప్పాలి. సాహిత్యంలో ఈ వస్తువు అన్న పదాన్ని చాలాసార్లు ఉపయోగిస్తుంటాం. నిజానికి వస్తువు చుట్టూ ఒక భావన ఉంటుంది. ఇదే వస్తువుకుండే పరిమితిని చూపిస్తుంది. ఇలాంటి వస్తు భావనలు కవి లేదా రచయిత వస్తువును ఎంత స్పష్టంగా చూస్తున్నాడనేది చెప్తుంది. కవి దర్శనంలో దృఢత్వాన్ని, నైశిత్యాన్ని, లోచూపును పట్టి చూపేది ఈ వస్తు భావనే. వస్తువు చుట్టూ ఒక విషయం ఉంటుంది. ఈ విషయం ఒక సామాజిక సమస్యను గుర్తించడం వల్ల ఏర్పడుతుంది. ఈ సమస్యను గుర్తించడమే చైతన్యం. ఈ చైతన్యం సాహిత్యానికి మూలం. ఈ చైతన్యమే సమస్యను గుర్తిస్తుంది. వస్తువు చుట్టూ ఎన్ని సమస్యలను గుర్తిస్తే అన్ని వస్తు భావనలు ఆ కవి కవిత్వంలో కనిపిస్తాయి. ఈ సంపుటి విషయానికి వస్తే వృద్ధాప్యంలో ఉండే అనేక సమస్యలను, ఆయా సందర్భాలను దార్శనికుడైన కవిని కదిలించాయి. అతనిలోని చైతన్యమే వాటిని సూక్ష్మాతిసూక్ష్మంగా అర్థం చేసుకునేలా చేసింది. అందుకోసం ఆయా విషయాలపై అంశాత్మక పరిశీలన చేసినట్లు మనం గమనించవచ్చు. ఆ పరిశీలనలో ఆర్థిక పరమైన, రాజకీయ పరమైన, సామాజిక పరమైన, తాత్త్విక పరమైన, సాంస్కృతిక పరమైన అనేక భావనలు కనిపిస్తాయి. అయితే, సాధారణంగా ఇవి కవి చింతనను బట్టి ఉంటాయి. ఈ వస్తు భావనల వల్లనే కవి కవిత్వాన్ని సమగ్రంగా, సంపూర్ణంగా అర్థం చేసుకోవడానికి వీలవుతుంది. కవిత్వంలో ఉపయోగించే సంకేతాలను బట్టి ఈ వస్తు భావనలు అర్థం చేసుకోవచ్చు. ఆ రకంగా వృద్ధాప్యంలోని సమస్యలను మానవీయ హృదయంతో అర్థం చేసుకొని కవిత్వం చేశారు డాక్టర్ ఎన్.గోపి.

మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలే అన్నాడు మార్క్స్. ఆర్థిక అవసరాల చుట్టూతే తిరిగే నేటి సమాజంలో మనిషికి మనిషికి మధ్య అనుబంధాలు మృగ్యమవుతున్నాయి. ఇక వృద్ధుల పరిస్థితి అయితే ఇంకా దయనీయంగా మారింది.

**వృద్ధాప్య పెన్షన్ల కోసం
ముసలమ్మలు క్యూలో నిలబడ్డారు
మొట్టమొదటిసారి కొడుకులు
గద్దల్లా కనిపిస్తున్నారు
'వద్దురా!
నా మందులగ్గావాల్రా
ఆకు వక్కలు కొనుక్కుంట బిడ్డా!'
అని శోకాలు పెట్టింది ముసల్ది
ఎవడు వింటడు!
యముడు ప్రాణాలు లాక్కుపోతున్నట్టు
పైసలు వదలదీసిండు
గుడ్లు తేలేసింది కన్నతల్లి
ఇప్పుడవే పైసల్తో
అంత్యక్రియలు జేస్తడు
గావచ్చు...**

ఈ కథనాత్మక కవితా పంక్తుల్లో ప్రభుత్వం ఇచ్చే వృద్ధాప్య పింఛన్ కోసం ఒక ముసలి తల్లి పడే ఆరాటాన్ని, ఎదురుచూపులని, వచ్చిన ఆ కొద్దిపాటి పింఛన్ డబ్బును ఆమె కొడుకు అమానుషంగా లాక్కుపోవటాన్ని దృశ్యమానం చేస్తున్నాడు కవి. పైన చెప్పుకున్నట్లుగా డాక్టర్ గోపికి వస్తువును అంశాత్మకంగా పరిశీలించే గుణం ఉంది. ఆ గుణం అతనికి విస్తృత లోకపరిశీలనా దృష్టినుంచి అబ్బింది. కవి తన ముందుమాటలో వృద్ధాప్యానికి ఎదురయ్యే సమస్యలు దైహికం, మానసికం, సామాజికం అని స్థూలంగా మూడు రకాలుగా ఉంటాయన్నాడు. పింఛన్ కోసం ముసలి స్త్రీ పడిగాపులు కాయడం కవి చెప్పినట్లు వృద్ధులు ఎదుర్కొనే సామాజిక సమస్య. కొడుకులు గద్దల్లా కనిపించడమూ సామాజిక జాడ్యమే. 'వద్దురా', 'బిడ్డా' పదాల్లో ఆ తల్లి లాలన, నిస్సహాయత వ్యక్తమవుతోంది. మందులు, వక్కలు కొనుక్కుంటాననడంలో వృద్ధాప్యం ఎదుర్కొనే దైహిక సమస్య కనిపిస్తుంది. ఆలనా పాలనా లేక ఆఖరికి ఆమె చనిపోతే ఆమె దగ్గర లాక్కున్న ధనంతోనైనా ఆమెకు అంత్యక్రియలు చేసే సంస్కారం ఆ బాధ్యత కొరవడిన కొడుక్కి ఉందా అన్న ప్రశ్న వేస్తున్నాడిక్కడ కవి.

ఒకప్పుడు సమాజం కుటుంబ కేంద్రకంగా ఉండేది. అలాంటి సమాజం నేడు దాదాపుగా వ్యక్తి కేంద్రకంగా మారిపోయింది. అంటే వ్యక్తి తన స్వేచ్ఛ, తన క్షేమం, తన సుఖమే పరమావధిగా భావించే సందర్భం వచ్చిందన్న మాట. ఆ రకంగా భార్యాభర్తలు, తోబుట్టువులు, తల్లిదండ్రులు మొదలైన బంధాల్లో అనుబంధం, బాధ్యత సన్నగిల్లుతున్నది. ఇలాంటి పరిణామ దశలో ఇక వృద్ధులకు చేయూతనివ్వడమనేది మరింత మృగ్యమైంది. అందుకే వేదనతో కవి గళమెత్తాడు. మానవీయ దృష్టితో కలం పట్టాడు.

**ఇవాళ కాసేపు
వృద్ధులను తలుచుకుందాం
మసకబారిన మన వెలుగులో
కొత్త ప్రకాశాలు
మొలుస్తాయేమో చూద్దాం..**

ఇక్కడ కవి ఒక స్నేహితుడు మనతో మాట్లాడుతున్నట్లుగానే కవిత్వం చెప్పాడు. ఎక్కడా ఉపదేశాత్మక వాచ్యం కనబడదు. కానీ ఆలోచింపజేసేదిగా ఉంటుంది. అందులోని నిజాయితీ, సారళ్యమే పఠితను చదివించేలా చేస్తుంది.

డాక్టర్ ఎన్.గోపి ఈ సంపుటి ద్వారా వృద్ధాప్యాన్ని జీవసాఫల్య దశగా అభివర్ణిస్తూ తన కవిత్వాన్ని కీర్తిమంతం చేశారు, శాశ్వతత్వం చేశారు. ఉపనిషత్ వాక్యాల్లాంటి సారభూతమైన జీవన తాత్త్వికతను దర్శింపజేశారు. వారి కవిత్వ ప్రయాణంలో ఈ వృద్ధోపనిషత్ ఒక మైలురాయిగా నిలిచిపోతుంది.



రాపోలు సీతారామరాజు
(వ్యాసకర్త: దక్షిణాఫ్రికా నుంచి)

**(జూన్ 25న డాక్టర్ ఎన్.గోపి 75వ జన్మదినోత్సవం సందర్భంగా...)**



## సందడి తొవ్వ

పొద్దుగాల్లనే తూరుపు దిక్కున
సూరీడు పొడవడం
యాది మరుస్తడేమో గానీ

ఎర్ర రంగు కండువా భుజానేసుకుని
కిర్రు కిర్రు చెప్పుల జోళ్లు
ఎర్రెర్ర ఫ్రేము కళ్ళజోడు
తొడుక్కుని గలమలోంచి
కాళ్లు బయటకేసి
సూరయ్యనే నిద్ర లేపేటోడు
మా నాయన

చీకటి
తెరలు తెరలుగా జారిపోతుంటే
ఆయన వాగొడ్డుకెల్లెందుకు
వెలుగు పులుగు లెక్క
రెక్కలు కట్టుకునేటోడు
దారిపొంట యాప్పుల్ల నముల్తు
మూడు మామిడి పిందెల అగ్గిపుల్లతో
దోస్తు బీడీని దోస్తులతో కలిసి
ఏఎన్నార్‌లా ఎలిగించేటోడు
నిజంగా నాయన మాకు హీరోనే

పట్టెడ మీద సుత్తితో కొట్టీ కొట్టీ
కుంపటి మంటల భగ భగలోనూ
కూనిరాగాలు తీస్తుంటే...
చెమట చుక్కలు సైతం
సిగ్గు బిళ్లల్ని కట్టేటియి

సిరాకు మంటను
కొడగొట్టంతో ఊదుతూ ఉంటే
అయ్య గుండె బొండిగల నుంచి
జారుతుందనిపించేది
గాలి తిత్తులతో విన్యాసం చేస్తూ
గజ్జెల్ని అతకటం చూస్తుంటే
శిఖరం అంచున
శివ తాండవం గుర్తొచ్చేది
పొద్దు గుంకంగనే
కాస్తంత కెంపేసుకుని
కల్లు వాయికాలతో
కాలానికి నిచ్చెన్న కట్టి
ఉసుల్తో ఉయ్యాలలూగేటోడు

బంగారు నగకు వనమ పెట్టినట్టే
నడతకు నాణ్యతనద్ది
బెత్తెడు సంతోషాన్ని
కమ్మెచ్చుతో సాగదీసి
బారెడు బతుకుల్లో పంచేటోడు
సన్న సన్న సమస్యల సత్తు ముక్కల్ని
సవనంతో తీసి దూరంగా పడేసి
ధన్వంతరిలా దర్శన మిచ్చేటోడు
బంధుత్వ గొలుసులు తెగకుండా
పట్టకారుతో పట్టి పదిలం చేసే
పెద్ద పనోడు ఆయన

ఊడ్చిన మసికట్టు నుంచి
అణువణువూ వడపోసి
స్వర్ణాన్ని వెలికితీసి ఒడిసి పట్టినట్టు
బొట్టు బొట్టు కన్నీటి నుంచి
బ్రతుకు బంగారాన్ని పట్టుకుంటోడు

నా ఎరుకలో యాడాదికోమారు
ఇంటిముందు వసారా కింద
రుంజోళ్ల సప్పుడు
మహా రంజుగా సాగేది
దిమ దిమ దరువంటే అదే మరి

సంబురాల రోజులన్నీ
ఏ రివాజు లేకుండానే
చెల్లాచెదురైనయ్
అయ్య తిరిగిరాని
లోకానికి తరలిపోయాక
కాలం గిర్రున తిరిగి
బ్రతుకు కావడిని మోయించింది

దిగులు బావిలో
దుఃఖాన్ని చేదుకుంటున్న
అవ్వనిప్పుడు ఒంటరిగా
పాతింట్ల సూత్తాంటే
నాయిన పరిచిన
సందడి తొవ్వ
యాదికొస్తాంది..!



డాక్టర్ కటుకోఝ్వల రమేష్
99490 83327

## వర్తన 5వ సమావేశం

**సాహిత్యరంగంలో** నవీన ధోరణులు పాదుకొల్పాలన్న లక్ష్యంతో ఏర్పాటైన వర్తన సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో 5వ సమావేశం ఈ నెల 25 మంగళవారం సాయంత్రం 6 గంటలకు రవీంద్రభారతి సమావేశ మందిరంలో జరుగుతుంది. ఈ సమావేశంలో 'తెలంగాణ నాటకం తీరు తెన్నులు' అనే అంశంపై తాటికొండాల నరసింహారావు ప్రసంగిస్తారు. ఈ సమావేశానికి డాక్టర్ రూప్‌కుమార్ డబ్బీకార్ అధ్యక్షత వహిస్తారు. ఒద్దిరాజు ప్రవీణ్‌కుమార్ సమన్వయకర్తగా వ్యవహరిస్తారు. కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు అందరూ ఆహ్వానితులే.

**– ఒద్దిరాజు ప్రవీణ్‌కుమార్, వర్తన కార్యదర్శి**

## ఆహ్వానం

**2024,** జూన్ 25 మంగళవారం, సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్‌లోని తెలుగు యూనివర్సిటీ ఎన్టీఆర్ ఆడిటోరియంలో సుప్రసిద్ధ కవి డాక్టర్ ఎన్. గోపి 75వ జన్మదినం సందర్భంగా ఆయన రాసిన 'రేపటి మైదానం' కవితా సంపుటిని ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్ ఆవిష్కరించనున్నారు. డాక్టర్ వోలేటి పార్వతీశం ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించనుండగా ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి అంకితాన్ని స్వీకరిస్తారు. అతిథులుగా ఆచార్య సూర్యా ధనంజయ, డాక్టర్ సుంకిరెడ్డి నారాయణ రెడ్డి, డాక్టర్ ఎస్.రఘు, వంగల హర్షవర్ధన్, డాక్టర్ ఎస్.జతిన్ కుమార్, కుడికాల వంశీధర్, పుప్పాల శ్రీరామ్, డాక్టర్ జె.నీరజ పాల్గొంటారు. కిన్నెర ఆర్ట్ థియేటర్స్ అధినేత మద్దాళి రఘురాం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగనున్నది.